

సిపిఎం నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - కొత్తూరు

వంశధార నిర్వాసితుల పోరాటం కేసులో సిపిఎం నాయకులపై నమోదైన కేసును కోర్టు కొట్టివేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, ఇతర సమస్యలపై వంశధార నిర్వాసితులు 2016లో పోరాటం చేశారు. ఈ పోరాటానికి సిపిఎం నాయకులు మద్దతునిచ్చారు. దీంతో ఆ పార్టీ నాయకులు భవిరి కృష్ణమూర్తి, జి.సింహాచలం, కె.నాగమణి, సిర్ల ప్రసాద్, కె.మోహనరావు, శంకరరావు, ఆవీసు, ముఖలింగంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వాదనలు విన్న జూనియర్ సివిల్ జడ్జి రాణి ఈ కేసును కొట్టివేస్తూ తీర్పును వెలువరించారు. సిపిఎం నాయకుల తరుపున న్యాయవాది మహంతి అప్పారావు వాదనలు వినిపించారు.

వరి సాగు బాగు



ఖరీఫ్ మొదటి రెండు నెలలు వర్షపాతం లోటు ఉన్నా ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలతో జిల్లాలో దాదాపు లక్ష్యం మేర పంటల సాగు నమోదైంది. జూన్, జులైలో వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చాలాచోట్ల వేసిన విత్తనాలు మొలకెత్తని పరిస్థితి తలెత్తింది. ఆగస్టు మూడో వారం, ఆ తర్వాత సెప్టెంబర్‌లో వరుస అల్పపీడనాల ప్రభావంతో విస్తారంగా వానలు పడడంతో ఆగస్టు, సెప్టెంబర్‌లో కొంతమేర వర్షపాతం లోటు తీరింది. మరోవైపు అటు వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం పెరగడంతో రిజర్వాయర్లు, బ్యారేజీల్లో పుష్కలంగా నీటి నిల్వలు ఉండడంతో పంటల సాగుకు దోహదపడ్డాయి. దీంతో గతేడాదితో పోలిస్తే వరి సాగు విస్తీర్ణంలో ఆరు శాతం పెరుగుదల నమోదైంది. వరి సహా ఇతర అన్నిరకాల పంటల సాగులోనూ ఎనిమిది శాతం పెరుగుదల కనిపిస్తోంది.

- 3.69 లక్షల ఎకరాల్లో పంటలు వేసిన రైతులు
- గతేడాదితో పోలిస్తే ఆరు శాతం పెరుగుదల
- అన్నిరకాల పంటల సాగులోనూ పెరుగుదల
- సాధారణం కంటే అదనంగా 5.29 వర్షపాతం నమోదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సాగుకు కొంత గడ్డు పరిస్థితులు నెలకొన్నా ఆ తర్వాత ఆగస్టు, సెప్టెంబర్‌లో వరుసగా సంభవించిన అల్పపీడనాలతో పంటల సాగు క్రమేణా జోరందుకుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో నిర్దేశించిన లక్ష్యానికి దాదాపు పంటల సాగు చేరుకుంది. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రైతులు వరి పంట సాగు బాగుంది. మొక్కజొన్న సాగు కాస్త బాగానే ఉన్నా, పత్తి, చెరుకు పంటల సాగులో తగ్గుముఖం కనిపిస్తోంది. 2025 ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు కలిపి 4,07,488 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తారని అంచనా వేయగా, 4,02,600 ఎకరాల్లో (98.80 శాతం) పంటలు వేయగలిగారు. ఈ సీజన్‌లో 3,76,773 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేయగా, ప్రస్తుతం 3,69,304 ఎకరాల్లో (98.02 శాతం) సాగవుతోంది. మొక్కజొన్న పంటను 23,873 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 20,696 ఎకరాల్లో (86.69 శాతం) వేశారు. పత్తి పంటను 3,125 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, 1531 ఎకరాల్లో (49 శాతం) రైతులు విత్తనాలు వేశారు. చెరుకు పంటను 2,623 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా 1404 ఎకరాల్లో (53.53 శాతం) వేశారు.

గతేడాది పంటల సాగు ఇలా...

జిల్లాలో 2024 ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,21,655 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 3,80,615 ఎకరాల్లో (90 శాతం) సాగైంది. వరి పంటను 3,87,323 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా 3,55,618 ఎకరాల్లో (92 శాతం) నమోదైంది. మొక్కజొన్న పంటను 25,270 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా 21,798 (86 శాతం) ఎకరాల్లో వేశారు. పత్తి పంటను 3,888 ఎకరాలకు గానూ 1880 ఎకరాల్లో (48 శాతం) వేశారు. చెరుకు 3,485 ఎకరాలకు గానూ 908 ఎకరాల్లో (26.05 శాతం) వేశారు.

ఖరీఫ్‌లో సాధారణం కంటే అదనంగా 5.29 వర్షపాతం నమోదు

జిల్లాలో ఈ ఏడాది వర్షపాతంలో కాస్త హెచ్చుతగ్గులు కనిపించాయి. సీజన్ ప్రారంభ నెల జూన్‌లో లోటు వర్షపాతం నమోదైంది. జులైలోనూ లోటు వర్షపాతమే కొనసాగింది. ఆగస్టులో రెండు వారాల పాటు చినుకు చుక్క కురవలేదు. మూడో వారం నుంచి వరుస అల్పపీడనాలు సంభవించడంతో కొంతమేర లోటు తీరింది. సెప్టెంబర్‌లో తరుచూ అల్పపీడనాలు సంభవించడంతో సాధారణ వర్షపాతం నమోదైంది. సీజన్ ప్రారంభమైన జూన్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు సాధారణంగా 784.3 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, ఇప్పటివరకు 825.8 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. అదనంగా 5.29 శాతం వర్షం కురిసింది. జూన్‌లో సాధారణంగా 134.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 92 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. వర్షపాతం లోటు 31.8 శాతంగా నమోదైంది. జులైలో 184.41 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 157.61 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టులో 181.94 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 229.56 మి.మీ వర్షం కురిసింది. సెప్టెంబర్‌లో 196.15 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 142.93 మి.మీ వర్షం కురిసింది.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పక్కాగా ధాన్యం సేకరణ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరణ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణకు సమయం ఉన్నందున గ్రామ, మండల స్థాయిలో సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం సేకరణ ఆలస్యం లేకుండా చూడాలన్నారు. పంటలు పండిన తర్వాత వర్షాలు వస్తే రైతులకు టార్పాలిన్లు అందేలా చూడాలని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో గత సమస్యలు పునరావృతం కారాదన్నారు. రైతులకు ముందుగానే ఒక ప్రణాళికను తెలియజేయాలని వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామిని ఆదేశించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 630 సచివాలయాలు ఉండగా, 530 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టనున్నట్లు వివరించారు. రైస్‌మిల్లు, రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యంలో తేమ శాతం తెలుసుకొనే విధంగా అక్కడే మిషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ధాన్యం సేకరణ చేయాలని చెప్పారు. జిపిఎస్ ఉన్న వాహనాలను మాత్రమే ధాన్యం తరలింపునకు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రెవెన్యూ సమస్యలపై అవగాహన అవసరం

జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో పౌర సరఫరాలు, పిజిఆర్ఎస్, రెవెన్యూ సమస్యలు, మ్యుటేషన్లు తదితర వాటిపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మ్యుటేషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సిబ్బందిపై పని ఒత్తిడి ఉన్నా, అత్యవసర పనులకు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. తహశీల్దార్ కార్యాలయాల నిర్మాణం, మరమ్మతులు చేయాల్సిన కార్యాలయాలు ఉంటే తక్షణమే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రెవెన్యూ క్రీడలు జిల్లాస్థాయిలో నిర్వహించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో సిఎస్ డిటిలు కీలకంగా వ్యవహరించాలన్నారు. మండల సర్వేయర్లు మ్యుటేషన్లు, ఆర్ఒఆర్‌ల ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్లు జి.జయదేవి, పద్మావతి, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, కలెక్టరేట్ ఆయా విభాగాల పర్యవేక్షులు, తహశీల్దార్లు, సివిల్ సప్లయ్ అధికారులు, సిఎస్ డిటిలు, రైస్ మిల్లర్స్ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తం

- విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాలి
- నీటి వనరుల నాణ్యత పరిశీలన : కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో సీజనల్ జ్వరాలు, పిల్లల ఆరోగ్యంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు మూడు వేల నీటి వనరులు పలురూపాల్లో ఉన్నాయని, ప్రతిరోజు ఎక్కడో చోట నీటి నాణ్యత పరీక్షలు నిరంతరం చేస్తుండాలని చెప్పారు. ఇందుకోసం అవసరమైన టెస్టింగ్ కిట్‌లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేస్తున్నామన్నారు. వసతిగృహాల్లోని నీటిని ప్రాధాన్యతా క్రమంలో పరీక్షిస్తూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ పథకాల అమల్లో పారదర్శకత పాటిస్తూ, ప్రజల్లో సానుకూల దృక్పథం పెంచేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం జిఎస్‌టి తగ్గింపుతో ఇంటింటికీ లబ్ధి పోస్టర్, స్త్రీనిధికి సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

నాటుసారాపై ఉక్కుపాదం

జిల్లాలో నాటుసారా తయారీ విక్రయాన్ని పూర్తిగా అరికట్టడానికి 'నవోదయం 2.0' కార్యక్రమం కింద కఠిన చర్యలు తీసుకుంటున్నామని, సారా రహిత జిల్లా లక్ష్యం సాధించే వరకు దాడులు, నిఘా కొనసాగుతాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు 179 ఐడి లిక్కర్ కేసులు నమోదు చేయగా, 221 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 3477.8 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకోగా, 27,790 లీటర్ల జెఎఫ్ వాష్‌ను ధ్వంసం చేసినట్లు చెప్పారు. సారా తయారీకి ఉపయోగించిన 75 కిలోల బెల్లంతో పాటు, నేరాలకు వినియోగించిన 17 వాహనాలను అధికారులు సీజ్ చేశారని తెలిపారు. సారా గురించి ఎవరైనా 14405 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. సారా తయారీకి సహకరించే గ్రామాలకు ప్రభుత్వ పథకాలు నిలిపివేయబడతాయనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో సారా తయారీ, వినియోగం పూర్తిగా లేదని నిర్ధారించుకున్న తర్వాతే వాటిని సారా రహిత గ్రామాలుగా డిక్లరేషన్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యాప్‌ల బహిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన యాప్‌లను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నామని ఫ్యాఫ్టో సంఘ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులకు గురువారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరు యాప్‌లు మినహా మిగిలిన యాప్‌లను బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు దూరం చేస్తున్న విధానాలను మార్చుకోవాలన్నారు. అలాగే ఉద్యోగుల బకాయిలు, డిఎలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి కమిషన్‌ను నియమించా లన్నారు. కార్యక్రమంలో ఫ్యాఫ్టో నాయకులు వి.ఆదినారాయణ, జి.శ్రీనివాసరావు, టి.బాబూరావు, కురమాన దాలయ్య, టి.వైకుంఠరావు, పి.గణపతిరావు, కుమారస్వామి, చక్రవర్తి, లక్ష్మణరాజా, వానయ్య పాపారావు పాల్గొన్నారు.

మందస : శుక్రవారం నుంచి యాప్‌లను బహిష్కరిస్తున్నామని ఫ్యాఫ్టో నాయకులు తెలిపారు. ఈ మేరకు ఎంఇఒ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, యుటిఎఫ్ జిల్లా పూర్వ కార్యదర్శి రాజన పరమేశ్వరరావు, ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గవ్వ భీమారావు, మండల కోశాధికారి సోమనాథ్ సిస్టు, ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కిరణ్, కె.సుందరరావు, కాసం శ్రీనివాసరావు, డి.చంద్రశేఖర్, కె.చిరంజీవులు, ఎస్.జగదీష్, నల్ల ఢిల్లీరావు, జి.గోపాల్, బి.భైరాగి, బి.రామారావు, ఎస్.రజని, కె.పద్మ, ఎన్.మురళి పాల్గొన్నారు.

నరసన్నపేట : శుక్రవారం నుంచి యాప్‌లను బష్కిరస్తున్నామని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఎంఇఒ శాంతారావును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టి.సుధీర్‌కుమార్, బాలకృష్ణ, కె.వైకుంఠరావు పాల్గొన్నారు.

కవిటి: ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నుంచి యాప్స్ బహిష్కరిస్తున్నట్టు కవిటి మండలం ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జికి మెమొరండం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇకనుంచి విద్యార్థులకు బోధించడం తప్పించి మరి ఏ పని కూడా చేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పాఠశాల బోధనకు ఉపాధ్యాయులను దూరం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న విధానాలు తక్షణమే మార్చుకోవాలని ఫ్యాప్టో నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు గురువారం ఎంఇఒ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కంచరాన జయరాం, గున్న సుభాష్, కుసుమూరు వెంకటరావు, గనియ ఢిల్లేశ్వరరావు, కోట్ని తిరుమలరావు, కోట సుందరరావు, వై.విశ్వనాథం, చంద్రశేఖరరావు, శ్రీనివాసరావు, రాంబాబు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.




వజ్రపుకొత్తూరు : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందిగాం : ఈ నెల 10 నుంచి బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్టు ఫ్యాప్టో నాయకులు ఎంఇఒ జి.నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బి.శంకరరావు, సిహెచ్.కృష్ణారావు, పిఆర్‌టియు నాయకులు కె.దాలయ్య, ప్రకాశరావు, జె.బాబూరావు, ఎపిటిఎఫ్ నాయకులు పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు ఇకెవైసి తప్పనిసరి

డ్వామా పీడీ బి.సుధాకరరావు



ఇకెవైసిని పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి - పొందూరు

ఉపాధి హామీ కూలీలందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు స్పష్టం చేశారు. మండలంలోని నందివాడలో ఉపా ధి కూలీల ఇకెవైసిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలోని నవంబరు ఒకటో తేదీ నుంచి ఉపాధి హామీ నిధులతో చేపట్టే ప్రతి పనికీ కూలీల ముఖ ఆధారిత హాజరు తీసుకోనున్నట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు చేపడుతున్న ఇకెవైసిని తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న సిసి రోడ్లు, పశువుల షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎపిఒ పైల శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సహాయకులు నరేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేశ్వరరావు

యూనివర్శిటీ టాపర్‌గా 'బొల్లినేని' విద్యార్థి

శ్రీకాకుళం రూరల్: ఎన్‌టిఆర్ వైద్యారోగ్య విశ్వ విద్యాలయం విడుదల చేసిన బిఎస్‌సి అలైడ్ అండ్ హెల్త్ కేర్ కోర్సుల్లో బొల్లినేని మెడ్‌స్కిల్స్ విద్యార్థిని తూతిక రమ్య సాహితీ మొదటి ర్యాంకు సాధించినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. బొడ్డేపల్లి గణరాజుకు రెండో ర్యాంకు, నీలంశెట్టి వికాస్‌కు 5వ ర్యాంకుతో పాటు మరిన్ని ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ఆప్తో మెట్రో విభాగంలో మిసనగిరి చిన్మయి మూడో ర్యాంకు, డయాలసిస్ విభాగంలో కలిగి అభి రెండో ర్యాంకు, ఇమేజింగ్ టెక్నాలజీలో తూతిక హారిక తొమ్మిదో ర్యాంకు సాధించారని వివరించారు. డిస్టెన్షన్‌లో 15 మంది ప్రథమ శ్రేణిలో, 40 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అకడమిక్ డైరెక్టర్ సిహెచ్.లక్ష్మీ పద్మజ అభినందనలు తెలిపారు.

నేషనల్ యూత్ వాలంటీర్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

2025-26 సంవత్సరానికి గానూ జాతీయ యువజన వాలంటీర్ల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సరం పాటు స్వచ్ఛంద సేవ చేయడానికి పదో తరగతి విద్యార్హత కలిగి, ఈనెల ఒకటో తేదీ నాటికి 18 నుంచి 29 ఏళ్ల వయసు కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వాలంటీర్లకు నెలకు రూ.ఐదు వేలు స్టైఫండ్ చెల్లించబడుతుందని తెలిపారు. వీరు పలు సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యువజన సంఘాల స్థాపన, క్రీడలు, ఆరోగ్యం, అక్షరాస్యత, పారిశుధ్యం, లింగ వివక్ష, డిజిటల్ అక్షరాస్యత వంటి అంశాలపై పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://nyks.nic.in/NationalCorps/nyc.html లింక్ ద్వారా ఈనెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా మై భారత్ కార్యాలయాన్ని గానీ 08942 222028, 8142172119 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఖతర్‌లో హోం కేర్ నర్సు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఖతర్ దేశంలో హోం కేర్ నర్సు ఉద్యోగాల నియామకాలకు మైనార్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఓవర్సీస్ మెన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ద్వారా చేపట్టనున్న ఈ నియామకాల్లో, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1.20 లక్షల జీతం లభిస్తుందని పేర్కొన్నారు. బిఎస్‌సి నర్సింగ్, జిఎన్‌ఎం అర్హత కలిగి రెండేళ్ల అనుభవం ఉన్న 21 నుంచి 40 ఏళ్ల మధ్య స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. ట్యాక్స్ ఫ్రీ శాలరీతో పాటు ఉచిత నివాసం, వైద్య సదుపాయం, రవాణా, వీసా, ఫ్లైట్ టికెట్లు వంటి సౌకర్యాలు ఉచితంగా కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/user-registration లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, దరఖాస్తులను skillinternational@apssdc.in మెయిల్‌కు పంపాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 13న విజయవాడలోని ఒఎంక్యాప్ కార్యాలయం, ప్రభుత్వ ఐటిఐ క్యాంపస్, రమేష్ హాస్పిటల్ రోడ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఎలక్ట్రానిక్స్ గ్రాండ్ ఎగ్జిబిషన్ సేల్

శ్రీకాకుళం: సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ ఎలక్ట్రానిక్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్ సేల్‌ను ఈనెల 10, 11 తేదీల్లో నగరంలోని టిటిడి కళ్యాణ మండపంలో ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జిఎస్‌టి నోడల్ అధికారి స్వప్నదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిఎస్‌టి చట్టంలో సంస్కరణల ద్వారా ఇటీవల అమల్లోకి వచ్చిన పన్ను రేట్ల తగ్గింపు ఫలితంగా అనేక వస్తువుల ధరలు తగ్గినట్లు వివరించారు. పన్ను రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొంటారని పేర్కొన్నారు. శ్రీకాకుళం నగర ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా సమీక్షా కమిటీ సమావేశాన్ని ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం పది గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంబంధిత జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

బల్లిపుట్టుగలో రెవెన్యూ యంత్రాంగం

- రాత్రి రెండు గంటల వరకూ విధుల్లోనే
- 664 మందికి నోటీసులు జారీ


పనిచేస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

ప్రజాశక్తి- కవిటి

బుధవారం రాత్రి నుంచి మండలంలోని బల్లిపుట్టుగ గ్రామం హాట్ టాపిక్‌గా మారింది. పలాసలో నిర్వహించిన సమీక్ష మధ్యలోనే రద్దు చేసుకుని ఆగమేఘాలపై బల్లిపుట్టుగ వచ్చిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జాయింట్ ఎల్‌పిఎం సమస్యల పరిష్కారంలో అలసత్వంపై రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని పూర్తయ్యేవరకు గ్రామంలోనే ఉండి పనిచేయాలని ఆదేశించారు. దీంతో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిఆర్‌ఒ, ఆర్‌డిఒ బుధవారం రాత్రి 11 వరకు బల్లిపుట్టుగలోనే ఉండి మండల రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దీంతో వేకువ జాము 2 గంటల వరకూ పనిచేసిన రెవెన్యూ అధికారులు గురువారం ఉదయం మళ్లీ గ్రామానికి చేరుకున్నారు. జాయింట్ ఎల్‌పిఎం సమస్యలు ఉన్న 664 మందికి నోటీసులు జారీ చేశారు. సమస్య ఉన్న ఇంటింటికీ వెళ్లి బాధితులతో మాట్లాడారు. అయితే అలసత్వం ఉన్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం, పనిచేయించడం వరకూ అందరూ అభినందించినా... ఇది కేవలం ఒకే గ్రామానికి పరిమితం చేయడంపై స్థానిక రైతాంగం పెదవి విరుస్తోంది. ముఖ్యంగా మండలంలో జాయింట్ ఎల్‌పిఎం సమస్యలు 2034 ఉన్నాయి. మరోవైపు తమకు జీరో విస్తీర్ణం సమస్య ఉందంటూ బొరివంక గ్రామానికి 208 మంది రైతులు ఏడు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. చివరికి కవిటి వచ్చిన కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. వీరందరికీ ప్రస్తుతం బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలన్నా, క్రయ విక్రయాలు జరుపుకోవాలన్నా వీలుపడక ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మండలంలోని రైతులందరి సమస్యపై అధికారులు స్పందిస్తే బాగుండేదని బాధితులు కోరుతున్నారు.

సంపద సృష్టించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని ప్రతి పంచాయతీ సంపదను సృష్టించుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సొంత ఆదాయ వనరులపై సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు అందరూ పంచాయతీ మౌలిక వసతులు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు, గ్రామాలకు కనెక్టివిటీ, డ్రైనేజ్ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీ నుంచి ఇంటిపన్నులు వసూలు చేయాలని, పంచాయతీలు సొంత నిధులు సమకూర్చుకొనుటకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రకాష్, డిప్యూటీ ఎంపిడిఒ కె.సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ,కార్యదర్శులు పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీల నిధులు సమీకరణకు పాటించాల్సిన సూచనలను మాస్టర్ ట్రైనీలు రాంబాబు, అమర్నాథ్‌లు అందజేశారు. ఈ శిక్షణలో కె.మురళీకృష్ణ, బూర్జ కార్యదర్శి బలివాడ కిరణ్ కుమార్, మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మందస: పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులతో గ్రామాల అభివృద్ధి చేసుకోవడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపిడిఒ వెంకట రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సొంత ఆదాయ వనరులు సమీకరణ, అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. స్థానిక పన్నులు, రుసుములు, అద్దెలు, ఇతర వినియోగదారు ఛార్జీల ద్వారా పంచాయతీలు స్వయంగా సంపాదించే ఆదాయాన్ని సూచిస్తుందన్నారు. ట్రైనర్‌గా కె.కూర్మారావు, పంచాయతీ ఇన్‌ఛార్జి అధికారి జయప్రకాశ్ వ్యవహరిస్తున్నారు.

పలాస : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు కేటాయించే నిధులు, పంచాయతీల సొంతంగా ఆదాయ మార్గాలను ఏర్పరచుకొని గ్రామాలను అభివృద్ధి చేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎ.అనురాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ పేరాడ ఆనందరావు, సద్గుణబాబు, సుధాకర్ పాల్గొన్నారు.


శ్రీకాకుళం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నందిగాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణలో ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, డిప్యూటీ ఎంపిడిఒ సంతోష్‌కుమార్, కార్యదర్శులు పి.సత్యం, హనుమంతరావు, ఎస్.జానకిరామ్, కె.ఎర్రయ్య పాల్గొన్నారు.

పొందూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఒఎస్‌ఆర్‌పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ పి.సింహాచలం, ఎఒ మధుసూదనరావు, రిసోర్స్‌పర్సన్‌లు సంతోష్‌గౌరీ బాబు, మనోజ్ కుమార్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న డిఎల్‌పిఒ వెంకటరమణ

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని నివగాం పంచాయతీ నిధుల దుర్వినియోగమయ్యాయని జిల్లా ప్రజా ఫిర్యాదుల విభాగంలో అదే గ్రామానికి చెందిన కమలహాసన్ ఆగస్టు 8న ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కలెక్టర్ స్పందించి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు టెక్కలి డిఎల్‌పిఒ ఇప్పిలి వెంకటరమణ పంచాయతీ కార్యాలయంలో గురువారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు సంతకం పెట్టాలని డిఎల్‌పిఒ కోరగా, ఆయన నిరాకరించారు. అనంతరం డిఎల్‌పిఒ రికార్డులు, ఎం.బుక్‌లను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ విచారణలో సర్పంచ్ ప్రతినిధి సోమేశ్వరరావు, కార్యదర్శి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారుల బృందం

పంట నష్టం అధికారులకు నివేదిస్తా

బూర్జ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంటలకు నష్టం వాటిల్లలేదని, ఈ విషయాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడం జరుగుతుందని వ్యవసాయ శాఖ ఎడి బి.రాజగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని అల్లిన, నీలాపురం, జి.వి. పురం, గిరడపేట తదితర గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురవడం వల్ల కొన్ని తాళ్ళ గింజలు వస్తాయని, తర్వాత కొన్ని గింజలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు ఈ ఐదు గ్రామాలకు సంబంధించి 150 మంది రైతులకు చెందిన 110 ఎకరాల్లో 50 శాతం వరకు పంట నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని వివరించారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలను పాటించాలన్నారు. ఇక్కడ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదిక అందించడం జరుగుతుందన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషారాణి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, స్థానిక సర్పంచ్ ప్రతినిధి జడ్డు మహేశ్వరరావు, రైతులు వారాడ రాంబాబు, దాసిరెడ్డి హరిబాబు, గేదెల చిన్న మౌళి, రాజాపు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జెఎసి నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సచివాలయం ఉద్యోగుల జెఎసి మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని లొద్దపుట్టిగా ఆలయం వద్ద గురువారం ఎన్నిక నిర్వహించారు. జెఎసి చైర్మన్‌గా పొల్లాయి అశోక్, సెక్రెటరీ జనరల్ బి.మనోజ్, కన్వీనర్‌గా పి.తారకేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సల్ల ప్రవీణ్, వైస్ చైర్మన్‌గా జోగమ్మ, మల్లేష్, ట్రెజరర్‌గా బాలకృష్ణ, నీరజ, పబ్లిసిటీ సెక్రెటరీగా చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డి.చి.రంజీవి, శారద పాడి, కవిత, సంతోష్, జయమ్మ, గోపాలరావు, డి.నవీన్‌లు ఎన్నికయ్యారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.


ఎన్నికైన జెఎసి నూతన కార్యవర్గ సభ్యులు

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

టెక్కలి రూరల్: మెళియాపుట్టి మండలం జంగాలపాడు వద్ద రాజ్‌యోగ్ గ్రానైట్ పరిశ్రమలో పిడుగుపడి మృతి చెందిన హేమరాజ్, రామ్ సునీల్, శ్రావణ్ కుమార్‌ల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని సిఐటియు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. టెక్కలి జిల్లా ఆస్పత్రి వద్ద జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రానైట్ కార్మికులు మృతి చెంది మూడు రోజులు అవుతున్నా... ఇంతవరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రానైట్ క్వారీ యాజామాన్యం పట్టించు కోలేదని ఆరోపించారు. పరిహారం ప్రకటించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యదర్శి హెచ్. ఈశ్వరరావు, జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చింతాడ తేజేశ్వరరావు, నంబూరు షణ్ముఖరావు, మధు, పాల్, గ్రానైట్ వర్కర్స్ పెద్దఎత్తున పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్ నాయుడు

వజ్రపుకొత్తూరు : మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్ ఎంపిపి వంక రాజు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆదాయాలు, వ్యవయాలపై చర్చరించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువులకు టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి మెట్ట పాపారావు సూచించారు. ఇప్పటికే గ్రామాల వారిగా టీకాలు వేస్తూన్నట్లు చెప్పారు. ఇటీవల కరిసిన వర్షాలకు నీటమునిగి పంటలు నష్టపోయాయని, నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ముంపు గ్రామాల్లో ఇప్పటికే పరిశీలించామని, ఎక్కడైనా పంటలు కుళ్లినట్లు ఫిర్యాదులు వస్తే పరిశీలిస్తామని ఎఒ దునుంజయ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదురు గాలలకు నేలకూలిన విద్యుత్ స్తంభాలు స్థానంలో కొత్త వాటిని అమర్చినట్లు విద్యుత్‌శాఖ ఎఇ వెంకటేశ్వరరావు తెలిపారు. ఏటా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని ఆందోళన చెందుతున్నామని సభ్యులు అన్నారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

వెంకటేశ్వరరావుకు నామినేటెడ్ పదవి

ప్రజాశక్తి- రణస్థలం

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎచ్చెర్ల నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి బాలబొమ్మన వెంకటేశ్వరరావు పార్టీకి చేసిన సేవలను గుర్తిస్తూ ఈస్ట్ కోస్ట్ జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ మెంబర్‌గా నామినేట్ చేస్తూ గత నెలలో ఎంపీ కేంద్రమంత్రి అశ్విని వైష్ణవికి రిప్రెజెంటేషన్ చేయగా, ఎంపీ రిప్రెజెంటేషన్‌ను కేంద్రమంత్రి పరిగణనలోనికి తీసుకొని వెంకటేశ్వరావుని ఈస్ట్ కోస్ట్ రైల్వే మెంబర్‌గా నియమిస్తూ ఈస్ట్ కోస్ట్ రైల్వే బోర్డు వారికి ఆర్డర్‌ను పాస్ చేశారు. సదరు విషయాన్ని తెలియపరచడానికి రైల్వే కేంద్రమంత్రి ఎంపీకి లేఖ ద్వారా సందేశాన్ని పంపారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గం జి.సిగడం మండల నాయకులు, కార్యకర్తలు, అలాగే మెంబర్‌గా నియమితులైన వెంకటేశ్వరరావు విజయనగరం టిడిపి కార్యాలయంలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి ఎచ్చెర్ల నియోజకవర్గం తరపున ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ వెంకటేశ్వరరావుని దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసి, అనంతరం వెంకటేశ్వరరావును జి.సిగడం మండల నాయకులను గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజుకి పరిచయం చేశారు.


ఎంపీ కలిశెట్టిని కలిసిన జి.సిగడాం నాయకులు

అన్ని రంగాల్లో రాణించాలి


చిన్నారితో సినీ హీరో సోహైల్

సోంపేట: ప్రతి విద్యార్థీ కుటుంబ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కష్టపడి కాకుండా, ఇష్టపడి చదువుకొని అన్ని రంగా ల్లో రాణించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సినీ హీరో సోహైల్ విద్యార్థులకు సూచించారు. సోంపేటలోని మహర్షి విద్యానికేతన్‌లో విద్యార్థులతో, ఉపాధ్యాయులతో గురువారం ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ లక్ష్యసాధనతో ఇష్టపడి చదువుకునేలా తీర్చిదిద్దాలని తొలి గురువులు తల్లిదండ్రులైతే. రెండో గురువులు ఉపాధ్యాయులని గుర్తు చేశారు. ప్రతి అడుగులోనూ క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత ఉండేలా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. ముందుగా చిన్నారులతో ముచ్చటిస్తూ పలు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. సోహైల్ పాఠశాలకు రాకతో పాఠశాలలో సందడి నెలకొంది.

సత్యనారాయణ ఆశయ సాధనకు కృషి

మందస: కొల్లి సత్యనారాయణ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మందస సిపిఎం నాయకులు కె.దేవేంద్ర పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో కామ్రేడ్ సత్యనారాయణ వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సత్యనారాయణ యావత్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ ప్రాంతంలో రైతాంగ, కార్మిక, ఉద్యోగుల సమస్యలపై ఉద్య మాలు నిర్వహించారని గుర్తు చేశారు. నిర్బంధాల సైతం లెక్కచేయకుండా పోరాడిన మహానాయకుడని కొనియాడారు. కృష్ణారావు, బి.మూర్తి పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సిపిఎం నాయకులు

ఢిల్లీరావుకు సన్మానం

పలాస : మండలంలోని బొడ్డపాడుకు చెందిన టిడిపి నాయకులు కిక్కర ఢిల్లీరావుకు గురువారం అమలకుడియా గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అమలకుడియాలో బుధవారం గౌరీ నందెన్న ఉత్సవాల్లో భాగంగా డాన్స్, కళా ప్రదర్శన చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు బుద్ధ వెంకటరమణ, సోదరులు బుద్ధ అప్పారావు, జెస్సి ఈవెంట్స్ అధినేత కిక్కర ఢిల్లీరావుకు ఘనంగా సన్మానించారు.

'ఐతమ్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


ఎంపికైన అభ్యర్థులు

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన పది మంది విద్యార్థులు తమ ప్రతిభతో విశేష విజయాన్ని సాధించారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఎంపికైన అభ్యర్థులకు గురువారం అభినందించారు. ప్రముఖ ఐటి సంస్థ గ్లోలోజిక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు నిర్వహించిన ఎంపికలో విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకోగాలిగారని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు సంస్థ ప్రథమ వార్షిక వేతనం రూ.5.2 లక్షల ప్యాకేజీను ఆఫర్ చేసిందని తెలిపారు. ఎంబిఎ, బిబిఎ గ్రూప్‌లకు చెందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ప్లేస్‌మెంట్ డాక్టర్ ఎం.సంతోషకుమార్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగధిపతి డాక్టర్ ఎన్.ఎల్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

జిఎస్‌టితో 2.0తో ప్రజలకు ఆదా

ప్రజాశక్తి- పొందూరు


పొందూరు : అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

జిఎస్‌టి 2.0తో అనేక రకాల మందుల ధరలు తగ్గడంతో ప్రజలకు ఎంతో ఆదాయం ఆదా అవుతుందని సిహెచ్‌ఒ వి.వాణి కుమారి, సిఫ్‌ఎల్ ఎం.రామారావు అన్నారు. మండలం రాపాకలో గురువారం కింతలి పిహెచ్‌సి సిబ్బంది జిఎస్‌టిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యపరంగా తగ్గిన మందుల ధరలు తెలియజేయడంతో ఆరోగ్యభీమా, జీవిత భీమాలకు జిఎస్‌టిని ఎత్తివేశారని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్.పి.మణిప్రసాద్, హెచ్‌వి రమణ, సిఫ్‌ఎల్ సిబ్బంది డి.లక్ష్మణ రావు, కె.సోమేష్, ఎఎన్‌ఎంలు ఉషా, శాంతికుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ ఎలక్ట్రానిక్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్, సేల్ ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ జిఎస్‌టి నోడల్ అధికారి స్వప్నదేవి ప్రకటనలో వెల్లడించారు. జిఎస్‌టి రేట్ల తగ్గింపుతో సామాన్యులకు ఊరట ఉంటుందన్నారు. నగరంలోని టిటిడి కల్యాణ మండపంలో ఎలక్ట్రానిక్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల అమల్లోకి వచ్చిన పన్ను రేట్ల తగ్గింపుల ఫలితంగా అనేక వస్తువుల ధరలు తగ్గినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొంటారని అన్నారు.

ప్రేమ పేరిట మోసం

గర్భం దాల్చిన బాలిక

ప్రజాశక్తి- బూర్జ

ప్రేమ పేరుతో నమ్మించి బాలికను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 17 ఏళ్ల బాలికను మండలంలోని గోపీదేవిపేటకు చెందిన 20 ఏళ్ల సవర పవన్ కుమార్ ప్రేమతో పేరుతో నమ్మించి, గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని బాలిక పట్టుబట్టడంతో నిరాకరించాడు. దీంతో బాధితురాలు కుటుంబసభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కవితల పోటీలో బంగారు పతకాలు

ఆమదాలవలస : తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శ్రీ గౌతమేశ్వర సాహితీ కళాసేవా సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ కవితా పోటీల్లో పట్టణానికి చెందిన ప్రముఖ కవులు కుప్పిలి వెంకట రాజారావు, కర్నేన జనార్దనరావులు తమ కవితలతో విశేష ప్రదర్శన కనబరచి బంగారు పతకాలు అందుకున్నారు. సెప్టెంబర్ 20న నిర్వహించిన ఈ కవితల పోటీల్లో కుప్పిలి వెంకట రాజారావు రచించిన 'జననికి జోతలు', కర్నేన జనార్దనరావు రచించిన 'పవిత్ర భారత భూమి' కవితలు సంస్థ ప్రచురించిన 'భారత మాతకు అభివందనం' అనే గ్రంథంలో చోటు దక్కించుకున్నాయి. విజేతలుగా నిలిచిన కవులు వెంకట రాజారావు, జనార్దనరావులకు సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను పోస్టు ద్వారా పంపినట్లు కవులు తెలిపారు.

పలుకుబడి బదిలీలు నిలుపుదల చేయాలి

టెక్కలి: పలుకుబడి బదిలీలను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయాలని డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఒక ప్రకటనలో కోరారు. మే నెలలో అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా బదిలీల్లో పలుకుబడి ఉన్న వారికి బదిలీలు జరిగాయన్న విమర్శలకు ప్రభుత్వం జవాబు చెప్పాల్సి ఉందన్నారు. ఇది చాలక ఇప్పుడు ఏకంగా ఉద్యోగ విరమణ ఖాళీల్లోనికి రాజకీయ పలుకుబడి ఉన్న వారికి బదిలీలను రాష్ట్ర విద్యాశాఖ చేపట్టడం సమంజసం కాదన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా... గతంలో జరిగిన పలుకుబడి బదిలీలకు, బదిలీల చట్టం చేసిన తరువాత జరుగుతున్న పలుకుబడి బదిలీలకు తేడా లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పలుకుబడి బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- లావేరు

జిల్లా ప్రధాన కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వివిధ రకాల క్రీడా పోటీల్లో నాలుగు విభాగాల నుంచి లావేరు మండల ప్రధాన కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల జగన్నాథం తెలిపారు. 200 మీటర్ల పరుగు పందెంలో వై. రఘు, త్రో బాల్‌లో బి.తనూజ, వై.రఘు, వాలీబాల్ పోటీలో వై.మహేష్, బేస్ బాల్ పోటీలో ఎ.జీవిత, ఎల్.లక్ష్మి, ఎ.భాను ప్రసాద్, ఎన్.ధనుష్, వై.కృష్ణ, ఎస్.రామకృష్ణ, వై.రఘు, ఎస్. గోవింద, ఎస్.కిషోర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఎంపికకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జర్జాన సుదర్శనం, విద్యార్థులను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లంకలపల్లి రాంబాబు, మాజీ అగ్రికల్చరల్ మార్కెట్ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్య దొర, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షులు పిసిని వసంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మెళియాపుట్టి: ఈ నెల 6,7,8 తేదీల్లో కోడిరామ్మూర్తి స్టేడియంలో స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో కరజాడ పాఠశాల విద్యార్థులు ప్రతిభ సాధించారు. లండ లిఖిత బాలికల విభాగంలో అండర్-17లో 1500 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలోను, మాగపాటి టెండూల్కర్ గుణ శ్యాంసుందర్ పోల్ వాల్ట్ అండర్-14 లోగుమ్మడి మనోజ్‌కుమార్ విభాగం, మజ్జి లాస్య బాలికల విభాగంలో ఖోఖోకి సంబంధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులతో పాటు మంచి తర్ఫీదునిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ దాసరి దీనబంధ్‌ను గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.వి. రమణమూర్తి, ఉపాధ్యాయులు కె.శ్రీరాములు, పి.రామారావు, ఎస్.దాస్, ఎల్.వి.చలం, పి.ప్రమీల, పుష్పలత, కె.కిరణ్‌లు అభినందనలు తెలిపారు.


లావేరు : ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కవిటి: మండలంలోని రాజపురంలో ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-19 వాలీబాల్ విభాగంలో బి.జ్ఞానేశ్వరరావు, ఎ.సంజయ్, ఎస్.పార్వతి, అండర్-17 వాలీబాల్ విభాగంలో డి.యమున, అండర్-14 వాలీబాల్‌కి బి.సంతోష్, బ్యాడ్మింటన్ విభాగంలో ఎ.తమన్ ఎంపికయ్యారు. క్రికెట్ విభాగంలో అండర్-19 ఇ.మహేష్, ఎం.అవినాష్, కబడ్డీ అండర్ -19 విభాగంలో జి.దీపిక ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ పాణిగ్రాహి తెలిపారు. వీరికి ప్రిన్సిపాల్‌తో వ్యాయామ ఉపాధ్యాయుడు నేతాజీ, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

వజ్రపుకొత్తూరు : జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని నగరంపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బి.కుమారస్వామి లాంగ్ జంప్, బి.కిరణ్ జావీలిన్ త్రో, తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.హారిక, ఎనిమిదో తరగతి విద్యార్థి ఎన్.రాజ్‌కమల్ అండర్ -14 కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరికి శిక్షకులుగా వ్యాయామ ఉపాధ్యాయులు పి.గజేంద్రరావు, జె.నారాయణరావు వ్యవహరించారు. హెచ్‌ఎం తలగాన హేమరావు, పిఎంసి చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన రమణారావు

చదవిన పాఠశాలలోనే ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి- పలాస

ఆయన ఒక సరస్వతి పుత్రుడు.... పనిచేసే పాఠశాలను అభివృద్ధి చేయడం, విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచేందుకు నిరంతరం పరితపిస్తూ ఉంటారు. చిన్నతనం నుంచి పోలీస్ శాఖలో ఉన్నతమైన అధికారిగా పనిచేయాలని కోరిక ఉన్నా ఉపాధ్యాయునిగా ఉద్యోగం రావడంతో సొంత ఊరు, చదువుకున్న పాఠశాలలో ఉద్యోగం చేయడం, ఉద్యోగ విరమణ పొందడం ఆనందంగా భావించారు. పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి సీమల వెంకట రమణారావు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో నేరుగా విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చదువుపై ప్రాధాన్యతను వివరించి డ్రాప్ అవుట్ పిల్లలను పాఠశాలలో చేర్పించారు. దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయడం, విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో సఫలీకృతులయ్యారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. యువకుడుగా ఉన్న సమయంలో గ్రామంలో యువజన సంఘం ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దారు.

కుటుంబ నేపథ్యం

మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన సీమల అప్పలస్వామి, సావిత్రిమ్మలకు నలుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి. అందులో మొదటి సంతానం సీమల వెంకట రమణ మాస్టర్. తండ్రి అప్పలస్వామి రైల్వేశాఖలో ఉద్యోగం చేయగా, తల్లి సావిత్రమ్మ గృహిణి. ఈయన 1963 సెప్టెంబరు 18న జన్మించారు. ఇదే గ్రామానికి చెందిన పద్మావతితో 1987 మే 10న వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు సాయి రాంజీ టాటా కంపెనీలో ఇంజినీరిం గ్‌గా పనిచేస్తుండగా, సాయి దినేష్, సాయి ఉదయ్ ఉన్నత చదువులు చదువుకున్నారు.


వెంకట రమణారావు, మాస్టర్

విద్యాభ్యాసం

మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన సీమల వెంకట రమణారావు మాస్టర్ ఒక్కటి నుంచి ఐదు వరకు ప్రాథమిక, ఆరు నుంచి పదో తరగతి వరకు బ్రాహ్మణతర్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించారు. ఇంటర్మీడియట్ పలాస జూనియర్ కళాశాల, డిగ్రీ కాశీబుగ్గ ఎస్‌బిఎస్‌వైఎం డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసించారు. ఎంఎ ఇంగ్లీష్ లిటరరీ కాకినాడ, మద్రాసులో బిఇడి చేశారు. చదువుకున్న సమయంలో సేవా కార్యక్రమాలు, నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు.

30 ఏళ్లు ఉపాధ్యాయ వృత్తిలో...

సీమల వెంకట రమణారావు 30 ఏళ్లు ఉపాధ్యాయ వృత్తిలో పనిచేశారు. 1995 జూన్ 15న వజ్రపుకొత్తూరు మండలం తాడివాడ పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరారు. అదే మండలంలో పూడిలంక, కిడిసింగి, డోకులపాడు, గారంపాడు పాఠశాలల్లో పనిచేశారు. ఉద్యోగోన్నతిపై పలాస మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో తొమ్మిదేళ్లు, వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారధి ఉన్నత పాఠశాలలో 2017 వరకు పనిచేశారు. అనంతరం బదిలీపై పలాస మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఏడాది పాటు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. 2018లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికై, అప్పటి కలెక్టర్ ధనుంజయ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

యువజన సంఘం ఏర్పాటు

వెంకట రమణారావు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు వివేకానంద యువజన సంఘం ఏర్పాటు చేశారు. తోటి స్నేహితులు, గ్రామస్తులు సహకారంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ బజార్‌లో గాంధీ విగ్రహం, సాయిరాం గుడి, విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేశారు.


పాఠశాలలో అభివృద్ధి పనులు

వెంకట రమణారావు పల్లిసారధి పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సమయంలో ఇంగ్లీష్ శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేశారు. బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హయాంలో 6,7,8 తరగతులను ఇంగ్లీష్ మీడియం, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న సమయంలో ట్రిపుల్ ఐటికి సుమారు 10 మంది విద్యార్థులు ఎంపిక కావడంలో కీలకపాత్ర పోషించారు. బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో సరస్వతి విగ్రహం, స్టీల్ గేట్, వంట గది, ఇండోర్ వేదిక, పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.12 లక్షల వ్యయంతో కన్వెన్షన్ హాల్ నిర్మాణం చేపట్టారు. ఇలా సరస్వతి సేవలో ఉంటూ తన ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారు. సెప్టెంబరు 30న ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు శుక్రవారం బ్రాహ్మణతర్ల పాఠశాలలో సన్మాన కార్యక్రమం చేపట్టనున్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి- కవిటి

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. కవిటి పంచాయతీ గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలు వివరించారు. ముఖ్యంగా బల్ల ఎర్ర గోవిందపుట్టుగ, కవిటి బెహరా వీధి, కొత్త పాలెంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని కోరారు. ప్రగడపుట్టుగకు చెందిన బెందాళం రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రగడపుట్టుగకు చేరుకునే మలుపులో చెత్త పడేసి అపరిశుభ్రత చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా శ్మశాన వాటికకు చేరుకునే మార్గం పరిశుభ్రం చేసి, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మృతదేహాలను తరలించేందుకు పంచాయతీ తరుపున పరిమిత రుసుంతో ఒక వాహనం ఏర్పాటు చేస్తే చాలా మందికి మేలు చేకూరుతుందని వివరించారు. గ్రామానికి వారానికి ఒకసారి చెత్త సేకరణ బండి పంపించాలని కోరారు. మాజీ సర్పంచ్ ఆరింగి మధు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని 16 గ్రామాలకు కచ్చితంగా ఉపాధి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, నాయకులు బెందాళం రమేష్, ఎం.శంకర్, దుద్ది ధర్మారావు, దుర్యోధన, వజ్జ రంగారావు, ఇన్‌ఛార్జి ఎపిఒ మోహనరావు, ఇఒ ఎం.రవి పాల్గొన్నారు.



కవిటి : మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు

ఇచ్ఛాపురం : మండలంలోని బాలకృష్ణాపురం పంచాయతీలో ఉపాధి పనుల గుర్తింపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ బోరుభద్ర కుమారి, సర్పంచ్ ప్రతినిధి బోరుబద్ర లోహిదాసు అధ్యక్షత వహించారు. గ్రామంలో రూ.2 కోట్ల వరకు ఉపాధి పనులు చేపట్టేందుకు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో టిఎ పీతాంబర, ఫీల్డ్ అసిస్టెంట్ గౌరి పాల్గొన్నారు.


వైసిపి నాయకులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

వైసిపి నాయకుల అడ్డగింత

ప్రజాశక్తి- నరసన్నపేట

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చలో అనకాపల్లి కార్యక్రమానికి బయలు దేరిన వైసిపి నాయకుల వాహనాలను గురువారం మడపాం టోల్ గేట్ వద్ద సిఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యాన అడ్డుకున్నారు. దీంతో వైసిపి నాయకులు, పోలీసుల మధ్య వాదన జరిగింది. ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు నిలుపుదల చేస్తున్నట్లు సిఐ తెలిపారు. ఎంత అడ్డుకున్న మేం మా అధినేత పిలుపు మేరకు వెళ్తామని ముక్తకంఠంతో వైసిపి నాయకులు బదులిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగినాయుడు, జెడ్‌పిటిసి చింతు రామారావు, రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సురంగి నర్సింగరావు తదితరులు ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఆర్‌డిఒ

విధుల్లో అలసత్వం వద్దు

ప్రజాశక్తి- పాతపట్నం

ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహించవద్దని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని కాగువాడ మహాత్మా జ్యోతిరావ్ పూలే బాలికల గురుకుల పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ క్రమంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వసతి, భోజనం ఇతర సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

చీడపీడల నివారణకు చర్యలు

కోటబొమ్మాళి: వరిసాగులో చీడపీడలకు నివారణ చర్యలు తప్పని సరిగా పాటించాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు అన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావుతో కలిసి కోటబొమ్మాళి సచివాలయం పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చీడపీడల నివారణ చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువులపైనే కాకుండా జీవన ఎరువులు వినియోగించాలని వారు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.

బాబూరావుకు పరామర్శ

లావేరు: మండలంలోని గోవిందపురం పంచాయతీ టిడిపి నాయకుడు ఇజ్జు బాబూరావును ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర గురువారం పరామర్శించారు.


పరామర్శిస్తున్న తోటయ్యదొర

బాబూరావు ఇటీవల అనారోగ్యం కారణంగా శస్త్రచికిత్స జరగడంతో విషయం తెలుసుకుని గోవిందపురంలో ఆయన స్వగృహంలో కోలుకుంటున్న బాబూరావును కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు లావేరు మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, మాజీ జెడ్‌పిటిసి ఎన్.త్రినాథ్, యినపకుర్తి రమణ, కరిమేరకల అనిల్ కుమార్, ఆదపాక రామారావు తదితరులున్నారు.

విద్యారంగం బలోపేతానికి కృషి

శ్రీకాకుళం సిటీ: విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు అన్నారు. నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న నూతన ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకుగాను పాఠశాలలో నియామకమైన కొద్ది రోజులకే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో జరగనున్న చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా. జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్ ఆవిష్కరించారు. పర్యావరణం కాపాడాలన్నారు. విద్యార్థి కేంద్ర బిందువుగా విద్యను అందించాలని చెప్పారు. జనవిజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, స్వావలంబన, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం నికరంగా కృషి చేయాలన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను, విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జి.చంద్రభూషణ్, మండల విద్యాశాఖ అధికారులు కృష్ణ,


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ రవిబాబు

వినోదిని, ఎపి బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమా మహేశ్వరి, జిల్లా అధ్యక్షులు పుట్ట ఉదయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, జిల్లా కోశాధికారి త్రివిక్రమ్, జిల్లా ఉపాధ్యక్షులు గగనకుమారి, జిల్లా నాయకులు జి మోషే, నాగరాజు, బయాలాజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల నూతన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధితో పేదలకు భరోసా

ప్రజాశక్తి- ఆమదాలవలస

పేద కుటుంబాలకు సిఎం సహాయనిధి ద్వారా పేదలకు భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బూర్జ మండలం కాలపర్తి గ్రామానికి చెందిన సుంకర మన్మధరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన కుటుంబానికి సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.3 లక్షల 50వేలు మంజూరు పత్రాన్ని మన్మధరావు మామ సరుబుజ్జిలి మండలం సుభద్రాపురం గ్రామానికి చెందిన అదపాక అప్పలనాయుడుకు గురువారం రాజధాని అమరావతిలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు పేదల కష్టాలను అర్థం చేసుకొని ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం అందజేస్తున్నారన్నారు.


అంగీకార పత్రం అందజేస్తున్న మల్లేశ్వరరావు

అంగీకార-2పై ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్న లే అవుట్-2లో అంగీకార-2పై ఇంటింటా ప్రచారం నిర్వహించామని హౌసింగ్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులు ఇంటికి వెళ్లి అంగీకార-2పై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. విద్యుత్ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా సోలారు పలకలు ఇంటిపైన ఏర్పాటు చేసుకోవాలన్నారు. 2.0 పథకం ప్రకారం ఇళ్లు లేని వ్యక్తులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు ప్రసాద్, జగన్ పాల్గొన్నారు.

విప్ అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 38వ జూనియర్ స్టేట్ అథ్లెటిక్స్ మీట్‌లో మూడు వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో ఎస్‌విజె విద్యార్థి కె.శిరీష కాంస్య పతకం సాధించింది. ఈమెకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ గురువారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, బి.జగ్గారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు జె.ముకుంద పాల్గొన్నారు.


పాడెను మోస్తున్న ఎమ్మెల్యే శంకర్

పాడె మోసిన ఎమ్మెల్యే

శ్రీకాకుళం రూరల్: గార మండలం సతివాడ గ్రామ టిడిపి మాజీ సర్పంచ్ గంగు ప్రభాకర్ అంత్యక్రియలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగు ప్రభాకర్ మృతి చెందారు. మరణవార్త విన్న ఎమ్మెల్యే ఫోన్‌లో మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని తనప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం గ్రామంలో జరిగిన అంత్యక్రియలో పాల్గొని పాడెను బరియల్ గ్రౌండ్ వరకు మోసి నివాళ్లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షునిగా రమణబాబు

ప్రజాశక్తి- నందిగాం

మండలం పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన అధ్యక్ష ఎన్నిక గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, డిప్యూటీ ఎంపిడిఒ సంతోష్ కుమార్‌ల అధ్యక్షత వహించారు. ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షునిగా కోరాడ రమణబాబు, గౌరవాధ్యక్షునిగా కొర్రాయి కృష్ణారావు, కంచరాన గోపీనాథ్, ఉపాధ్యక్షునిగా, పాగోటి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా బసవ కుమారి, ట్రెజరర్‌గా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జానకి, జాయింట్


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

సెక్రటరీ డి.గౌతమి, మెంబర్లుగా రాహుల్‌రాయ్, హేమసుందర్, వర్ధన్, సంతోష్ పైల, దిలీప్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


పట్టా అందిస్తున్న విప్ అశోక్

ప్రేమ్‌చంద్ కుటుంబానికి బాసట

ప్రజాశక్తి- కవిటి

బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో మృతి చెందిన సోంపేట పట్టణానికి చెందిన ప్రేమ్ చంద్ కుటుంబానికి ప్రభుత్వం బాసటగా నిలిచింది. ప్రేమ్ చంద్ మృతి తరువాత అతని కుటుంబం అవయవ దానానికి అంగీకరించింది. అంతేకాకుండా కుమారుడి పేరుమీదుగా ట్రస్టు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు తెలిపారు. దీంతో విప్ అశోక్ కృషితో ప్రభుత్వం కంచిలి మండలంలో ప్రేమ్ చంద్ ట్రస్టు కోసం స్థలం కేటాయించింది. గురువారం కంచిలి రెవెన్యూ అధికారుల సమక్షంలో ప్రేమ్ చంద్ కుటుంబానికి స్థలం పట్టా అందించారు.

విద్యార్థి దశ కీలకం

ప్రజాశక్తి- పలాస

భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే విద్యార్థి దశ కీలకమని కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని రంగోయి ఉన్నత పాఠశాలలో గురువారం గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణగా మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తోటి మహిళా విద్యార్థులను గౌరవించాల


మాట్లాడుతున్న సిఐ సూర్యనారాయణ

న్నారు. గంజాయి, మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పాడ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటిచూపుపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కంటి చూపుపై నిర్లక్ష్యం వద్దని, అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని నేత్ర వైద్యులు డి.రాజశేఖర రెడ్డి అన్నారు. 26వ ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఆదివారంపేట అర్బన్ హెల్త్ సెంటర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వయసుల వారు క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలన్నారు. 40 ఏళ్లు పైబడిన వారు కేటరాక్ట్, గ్లూకోమా, అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నవారు రెటీనా పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నారుల్లో కంటి సమస్యలు, దృష్టి లోపాలు గుర్తించి సకాలంలో చికిత్స చేయించాలన్నారు. వెల్డింగ్ వంటి వృత్తుల వారు కంటి అద్దాలను ధరించి కళ్లకు గాయాలు కాకుండా కాపాడుకోవాలని తెలిపారు. పోషకాహారం తీసుకోవాలని, మొబైల్ ఫోన్స్, కంప్యూటర్ వినియోగం తగ్గించి కంటి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.పుష్పలత మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారులు,


కంటి చూపుపై ప్రచారం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

పారామెడికల్ అప్తాల్మిక్ అధికారుల సహకారంతో కంటి పరీక్షలు, అవగాహన సదస్సులు నిర్వహించామని, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా కంటి చికిత్సలు నిర్వహించడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ నియామకం

శ్రీకాకుళం సిటీ: ఎచ్చెర్ల నియోజకవర్గం మార్కెట్ కమిటీని నియమిస్తూ డైరెక్టరాఫ్ అగ్రికల్చర్ గుంటూరు వారు ఉత్తర్వులు జారీచేశారు. అధ్యక్షులుగా నిడిగుట్ల పద్మ, ఉపాధ్యక్షులుగా బూరాడ వెంకటరమణ, సభ్యులుగా అనకాపల్లి రాజేశ్వరి, కెవివి నరసింహమూర్తి, అడకుల వాసు, బి.సునీత, టొంప నీలవేణి, అలుపాన మీనాక్షి, కెల్ల భారతి, చిల్లా రామసూరి, మహంతి అనంత్, మాడుగుల శ్రీనివాస రావు, దండాసి రాంబాబు, గొర్లె దివ్య, పోతల చిరంజీవిలను నియమించారు. త్వరలో వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు.


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

చందుకు అభినందనలు

పోలాకి: ఎపి మోడల్ స్కూల్‌లో చదువుతున్న కె.చందు ఫెన్సింగ్ క్రీడలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో చందుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల శ్రీకాకుళం టౌన్ హాల్‌లో ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి అండర్-19 విభాగంలో ఫెన్సింగ్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ ఎం.నీలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

రహదారి ప్రమాదాలపై అప్రమత్తం

పొందూరు: రహదారి ప్రమాదాలపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి. సత్యనారాయణ అన్నారు. మండలంలోని రాపాక కూడలిలో గురువారం రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడుపరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, వాహన వేగాన్ని నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ శాంతారావు

చదువుపై ఆసక్తి ఉండాలి

నరసన్నపేట: విద్యార్థులు తమ చదువులపై ఆసక్తి కలిగి ఉండాలని ఎంఇఒ యి.శాంతారావు సూచించారు. మండలంలోని కొల్లవానిపేటలో ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీశారు. పుస్తకాలు, హోమ్ వర్క్ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

పలాస : కాశీబుగ్గకు చెందిన గోపి అనే మెకానిక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలుసుకొని ఆయనకు రూ.5 వేలు నగదు, నెల రోజులకు సరిపడా


సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవారికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జ్యోతి, సాయి, కిరణ్మయి, సుంకాన ఉమా శంకర్‌పాల్గొన్నారు.